# 1. శునకసుందరి కథ....

సౌరాష్ట్రలోని జునాఘడ్ సంస్థానాధీశుడైన హిజ్ హైనెస్ నవాబ్ సర్ మహబత్‌ఖాన్ రసూల్‌ఖాన్ ఒక అసాధారణ వ్యక్తి.

ఆయనగారి అభిరుచులూ, ఆచరణలూ సాధారణులకేగాదు, సాటి మహారాజులకు కూడా భిన్నమైనట్టివి.

నవాబుగారికి కుక్కలంటే బహు ప్రీతి. వారి దివాణంలో అశ్వశాలతోపాటు ఓ శునకశాల కూడా ఖ్యాతివహించి ఉండేది. అందులో అక్షరాలా తొమ్మిదివందల మేలుజాతి శునక రాజాలుండేవి.

ఓ శునక సుందరిని నవాబుగారు చిన్నప్పట్నించీ అల్లారుముద్దుగా, రాజభోగాల మధ్య పెంచుతూ దానికి "రోషనార" అని నామకరణం కూడా చేశారు.

'రోషనార' అంటే నవాబుగారికి ప్రాణసమానమనీ, దానిని వదలి వారు ఓ క్షణం కూడా ఉండలేరనీ సంస్థానంలోని మెడమీద తలకాయ గల ప్రతి ఒక్కరికీ తెలుసు.

ఇలా ఉండగా అసాధారణ వ్యక్తియైన మన నవాబుగారికి ఓ సుప్రభాతాన అసాధారణ విషయ మొకటి మెరుపులా బుర్రలో మెరిసింది.

వారు తక్షణం ప్రధానమంత్రి సర్ అల్లా బక్షిగారిని పిలిపించి "మంత్రీజీ! మన రోషనారకు యుక్తవయస్సు వచ్చిందిగదా! మరి పెళ్ళి చేయవద్దా?" అని ప్రశ్నించారు.

నవాబుగారి సంగతి బాగా తెలిసిన అనుభవజ్ఞుడైన మంత్రిగారు ఆశ్చర్యపడక "అవును, ప్రభో ! నాకు తోచనేలేదు'' అని లెంపలు వేసుకున్నారు.

అప్పుడు నవాబుగారు ఏమని హుకుం జారీ చేశారంటే...

"ఇది నా ముద్దుబిడ్డగదా ! ఆ సంగతి మన రాజ్యంలో తెలీనివాడే లేడుగదా ! కనుక రాకుమార్తెకైతే ఎంత వైభవంగా కళ్యాణోత్సవం జరుపుతామో అంత ఘనంగానూ మన రోషనారకుకూడా వివాహమహోత్సవంజరిపే ఏర్పాట్లు చేయించవలసింది.''

నవాబుగారు తలచుకుంటే దెబ్బలకుగానీ, పెళ్ళిళ్ళకుగానీ, చావులకు గానీ కొదవేమిటి ?

కనుక...

తక్షణమే వరనిర్ణయం జరిగిపోయింది. రాజపురోహితులు శుభ లగ్నం నిర్ణయించారు.

సకల లాంఛనాలతోనూ దేశంలోగల మహారాజులకూ, రాజులకూ, రాజకుటుంబీకులకూ, రాజోద్యోగులకూ, బ్రిటిష్ ప్రభుత్వంలోగల నవాబుగారి ఆంగ్లమిత్రులకూ, వైస్రాయిగా అత్యున్నత పదవిలోనున్న లార్డుఇర్విన్ దంపతులకూ ప్రత్యేక దూతలద్వారా వివాహమహోత్స వాహ్వానాలు అందజేయబడ్డాయి.

ఒక్క వైస్రాయిదంపతులు తప్ప తదితరులెల్లరూ నవాబుగారింటి శుభకార్యానికి ఆనందించి, ఆ ఆహ్వానాన్నంగీకరించి దూతలను సత్క రించి అడ్వాన్సుగా కొన్ని కానుకలను కూడా ఇచ్చి మరీపంపారు

కళ్యాణోత్సవ దినాన ప్రాతఃకాలాన్నే అంతఃపుర పరిచారికలు రోషనారను పన్నీట జలకమాడించి, వెలలేని ముత్యా, రత్న హారాలతో

అలంకరించి కళ్యాణ వేదిక నిర్మింపబడిన నవాబుగారి దర్బారు హాలుకు సర్వలాంఛనాలతోనూ తోడ్కొని తెచ్చారు.

ఇక్కడిలా ఉండగా శునకవరుణ్ణి తోడ్కొని తెచ్చేందుకుగాను మన నవాబుగారు...మంచి దుస్తులూ, ఆభరణాలతో అలంకరింపబడిన 250 మేలుజాతి శునకాలూ, మంత్రులూ, సంస్థానోద్యోగులూ, రాజ కుటుంబీకులూ, రాజోద్యోగులూ, రాజబంధువులూ వెంటరాగా పట్టపుటేనుగు నెక్కి జునాఘడ్ రైల్వేస్టేషన్‌కు వేంచేశారు.

వరుడు మంగ్రోల్ సంస్థానాధీశుని పెంపుడుకుక్క 'బాబీ'.

మంగ్రోల్ నవాబుగారు శునకయుక్తంగా పరివార సమేతంగా రైలు దిగగానే గౌరవ సూచకంగా తుపాకులు పేల్చబడ్డాయి. స్టేషన్ బయటి వరకూ రత్నకంబళం పరచబడింది. సైనికులు గౌరవ వందన మాచరించారు.

శునక సుందరుడు సగౌరవంగా కళ్యాణ మంటపానికి తోడ్కొని పోబడినాడు.

నవాబుగారు మూడు రోజులపాటు సంస్థానమంతటా శెలవు ప్రకటించారు.

అపూర్వమైన ఈ వివాహమహోత్సవాన్ని తిలకించేందుకుగాను జునాఘడ్ చేరిన దాదాపు 50 వేలమంది ప్రజలకు నవాబుగారు విందు భోజనాలు ముప్పూటలా ఏర్పాటు చేయించారు.

నగరవాసు లెల్లరకీ ఆ మూడు రోజులూ భోజన, ఫలహారాదులు ప్రత్యేకవాహనాలలో దూతలద్వారా ఇంటింటికీ, పేరుపేరునా అందచేయబడినాయి.

ఆహ్వానితులై విచ్చేసిన మహారాజులకూ, రాజులకూ, తదితర ప్రముఖులకూ వారివారి విడుదులలో ఇంద్రభోగా లేర్పాటయినాయి. వారి నలరించేందుకుగాను బొంబాయి, బరోడా, ఇండోర్‌లనుండి వాసికెక్కిన నర్తకీమణులు రప్పింపబడ్డారు.

భారతదేశం నలుమూలల నుండీ విచ్చేసిన మహారాజులు, మంత్రులు, సామంతులు ఆదిగాగల 700 మంది మహామహుల సమక్షంలో......

జునాఘడ్ సంస్థానాధీశుని శునకసుందరిని రోషనారకూ, మంగ్రోల్ సంస్థానాధీశుని శునక సుందరుడు బాబీకి ఆ దర్బార్ హాలులో రాజ పురోహితులు రాజోచిత లాంఛనాలతో శాస్త్రోక్తంగా, మంత్రయుక్తంగా సర్వులూ సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తూండగా కళ్యాణోత్సవం మహా వైభవంగా జరిపించారు.

చరిత్రాత్మకమైన ఆ మహోత్సవాన్ని వందలాది ఫొటోగ్రాఫర్లూ, పత్రికా విలేఖరులూ, డజన్లమంది సినిమాటోగ్రాఫర్లూ రికార్డుచేశారు. ముఖ్యమైన భారతీయ, విదేశీయ పత్రికలన్నీ ఈ అపూర్వ సంఘటనను సవివరంగా సచిత్రంగా, సగౌరవంగా ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి ప్రకటించాయి.

ఆ దినం నూతన దంపతుల గౌరవార్థం బ్రహ్మాండమైన విందు ఏర్పాటు చేయబడింది.

రోషనార, బాబీల కటూ ఇటూ మంగ్రోల్, జునాఘడ్ నవాబులు ఆశీనులవగా, వారి సరసన కూర్చొని ఆహ్వానితులై తరలి వచ్చిన రాజాధిరాజు లెల్లరూ సుష్టుగా విందారగించి వధూవరుల నాశీర్వదించి వెల లేని కానుకలిచ్చారు.

శునకసుందరుడు బాబీమాత్రం పెళ్ళయి వారం తిరగకుండానే, సద్దుమణగగానే నవాబుగారి శునకశాలలోకి విసరివేయబడి అక్కడ వెయ్యిన్నొకటో వాడయిపోయాడు.

మరి ఇంత కథకూ ఫలశ్రుతి ఏమంటే...

ఈ కళ్యాణ మహోత్సవార్భాటాన్నిచూసి తల తిరిగిపోయిన మహారాజుల్లో కొందరు, ముఖ్యంగా పాటియాలా, జింద్ వంటి ఉత్తర భారత సంస్థానాధీశుల్లాంటివారు తమ పెంపుడు కుక్కలకుకూడా అంతకన్న ఘనంగా కళ్యాణ మహోత్సవాలు జరిపి, దాని నొక ఫేషన్‌గా, గౌరవ సంప్రదాయంగా సుప్రతిష్టితం చేసివేశారు.

★